
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 17 ఏప్రిల్ 2025



అన్నదాతకు నిబంధనాలు!

అన్నదాతలు నిబంధనల చట్రంలో చిక్కుకొని అల్లాడిపోతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పండించిన ధాన్యం అమ్మేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి రాకతో కుప్ప నూర్పిళ్లు ముమ్మరం చేసిన రైతులు ధాన్యం ఎక్కువ రోజులు పొలాల్లో నిల్వ చేయలేక స్థానిక మిల్లులకు తరలించారు. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు నిబంధనల బాంబు పేల్చారు. జీపీఎస్ ఉన్న వాహనాల్లోనే ధాన్యం తరలించాలని, ముందుగా ధాన్యం మిల్లులకు పంపితే బిల్లులు రావంటూ స్పష్టం చేశారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించాలని వేడుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలుపై ఆంక్షలు

- జీపీఎస్ ఉన్న వాహనాల్లోనే ధాన్యం తరలించాలని స్పష్టం
- ముందుగా ధాన్యం మిల్లులకు పంపితే బిల్లులు రావని హెచ్చరిక
- ఇప్పటికే మిల్లులకు తరలిపోయిన జిల్లాలోని రైతుల ధాన్యం
- నిబంధనలు సడలించాలని ప్రభుత్వానికి వేడుకోలు


మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో ధాన్యం చూపుతున్న రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని రైతుల వద్ద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 1.50 లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ఏటా వలే ప్రభుత్వం ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో మిగులు ధాన్యం 40 వేల టన్నులు కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చింది. దీంతో పాటు రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం మరో 10 వేల టన్నులు కొనుగోలు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో కొంత మేర అయినా ధాన్యం అమ్మకానికి అవకాశం వచ్చిందని రైతులు సంబరపడ్డారు. కానీ ఈ లోగానే పౌరసరఫరాల సంస్థ అధికారులు ధాన్యం కొనుగోలుపై నిబంధనలు విధించారంటూ మిల్లర్లు, రైతు సేవా కేంద్రాలకు విధివిధానాలను పంపించారు. నాలుగురోజుల క్రితమే ఏ మిల్లు ఎంత ధాన్యం కొనుగోలు చేయాలనే అంశంపై లక్ష్యాలు విధించారు. కానీ ధాన్యం మిల్లులకు పంపకుండా నిబంధనల పేరుతో తీవ్ర జాప్యం చేస్తున్నారు.



వాస్తవ పరిస్థితి ఇదీ

వేసవికాలం కావడంతో రైతులు ఇప్పటికే కుప్పనూర్పిళ్లు పూర్తిచేశారు. ధాన్యం మిల్లులకు తరలించారు. గుడ్లవల్లేరు, పెడన, మోపిదేవి, మచిలీపట్నం, మొవ్వ, పామర్రు, ఘంటసాల తదితర మండలాల్లో ఈ పరిస్థితి ఉంది. కుప్పనూర్పిడి అనంతరం పొలంలో రోజుల తరబడి ధాన్యం ఉంచితే భద్రత లేకపోవడంతోపాటు, వర్షం కురిస్తే తడుస్తాయనే భయంతో రైతులు ధాన్యం మిల్లులకు తరలించారు. దీంతో పాటు బయటి ప్రాంతాల మిల్లులకు, వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర బస్తాకు రూ.1,725లకు బదులుగా వంద రూపాయలు ధర తగ్గించి రూ.1,612లకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు స్థానిక మిల్లర్లతో ఉన్న అనుబంధంతో అక్కడికి తరలించారు. ఇంతా జరిగాక పౌరసరఫరాలసంస్థ అధికారులు ఇప్పుడు ధాన్యం కొనుగోలులో తాము సూచించిన నిబంధనలన్నీ పాటించాలనే షరతులు పెట్టడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైనా ఒకటీ రెండు చోట్ల ధాన్యం కొనుగోలులో తప్పులు దొర్లుతాయని, వాటిని ఆధారంగా చేసుకుని జిల్లాలోని రైతులందరినీ ఇబ్బందులు పెట్టడం సరికాదంటున్నారు. అధికారులు వెంటనే నిబంధనలను సడలించాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలు ఇవీ..

జిల్లాలోని రైస్ మిల్లులు, ఆర్‌ఎస్‌కేలకు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలను రెండు రోజుల క్రితం పంపారు.

- ఖరీఫ్ సీజన్ 2024-25 సంవత్సరానికి సంబంధించి మిగులుబాటు ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లుల నుంచి మార్కింగ్ చేసిన సంచులనే వాడాలి.
- జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకుని వాటిలోనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి.
- జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకుని వాటిలోనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి.
- మిల్లులకు ముందుగానే ధాన్యం పంపి ఆ తర్వాత ఆన్‌లైన్ చేయడం పూర్తిగా నిషేధం.
- మిల్లుల వద్ద జీపీఎస్ వాహనం ఉంచి ట్రక్ షీట్ జనరేట్ చేయకూడదు.
- జీపీఎస్ వాహనాలను ధాన్యం కల్లాలు, రైతు సేవా కేంద్రాల వద్ద ఉంచి ఆన్‌లైన్‌లో ట్రక్ షీట్ జనరేట్ చేసిన తర్వాతే ధాన్యం మిల్లులకు తరలించాలి. ఈ సమయంలో అక్కడి ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- జీపీఎస్ సౌకర్యం ఉన్న వాహనాల్లో ధాన్యం లేకుండా మిల్లుల వద్ద ఉంచి ట్రక్ షీట్ జనరేట్ చేస్తే జీపీఎస్ నమోదు కాదు. ఇలా చేస్తే రైతుల ధాన్యం బిల్లులు, వాహనాల రవాణా చార్జీలు చెల్లించరు. అదే సమయంలో రైస్ మిల్లులకు ధాన్యం మరపట్టిన బిల్లులను నిలిపివేయడం, సదరు మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు.


వినగడపలో రాలిన మామిడి ఏరుతున్న కూలీలు



నేలరాలిన ఆశలు

ఈదురు గాలులకు మామిడి రైతులు కుదేలు

- చెట్ల నుంచి రాలిపోతున్న కాయలు
- కొనేవారు లేక కాయల్ని పారబోస్తున్న రైతులు
- ఈనెలలో ఇప్పటికి నాలుగుసార్లు బీభత్సం
- తిరువూరు, మైలవరంలో భారీగా నష్టం


ఈదురు గాలులకు రెడ్డిగూడెంలో చీలిపోయిన మామిడి చెట్టు

తిరువూరు/విస్సన్నపేట/గంపలగూడెం/మైలవరం రూరల్/రెడ్డిగూడెం/జి.కొండూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులు మామిడి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఈనెలలో 15 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు ఈదురు గాలులు సృష్టించిన బీభత్సంతో 80 శాతానికి పైగా మామిడి కాయలు నేలరాలాయి. పగలు భారీ ఎండ, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులు వీస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు ఉండట్లేదు. ఇప్పటికే మూడుసార్లు వీచిన గాలులకు 60 శాతం మామిడి కాయలు నేల రాలిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి మారోసారి గాలులు బీభత్సం సృష్టించడంతో మరో 20 శాతం కాయలు నేలరాలాయి. కోతలు కోసినట్టుగా తోటలు ఖాళీగా మారిపోయాయి.

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో..

తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం, జి.కొండూరు, మైలవరం, విజయవాడ రూరల్ మండలంలో మామిడి తోటల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ ప్రాంతాల్లో వరి తర్వాత రైతులు రెండో ప్రధాన పంటగా మామిడిని మిగతా 6లో..

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. లబ్ధిదారుల హ్యాపీనెస్ట్ కలలు తీరబోతున్నాయ్. రాజధాని అమరావతిలో జీ ప్లస్ 18 టవర్స్ నిర్మాణ పనులకు కాంట్రాక్టు సంస్థ సిద్ధమైంది. బుధవారం నేలపాడులో నిర్మాణ ప్రాంతానికి ఎన్‌సీసీ లిమిటెడ్ భారీ ఎత్తున యంత్ర సామగ్రిని దించింది. భారీ క్రేన్లు, భారీ ఎర్త్‌హోల్ డ్రిల్లింగ్ మెషీన్లు, పైల్ మెషీన్లు వంటివాటిని తెప్పించింది. వారం రోజుల్లో పనులకు శ్రీకారం చుట్టడానికి ఏర్పాట్లు చేసింది.

హ్యాపీనెస్ట్!

వారంలో హ్యాపీనెస్ట్ జీ ప్లస్ 18 టవర్స్ నిర్మాణ పనులకు శ్రీకారం

- సైట్ ఏరియాలో భారీ యంత్రాలను దించిన కాంట్రాక్టు సంస్థ
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులు
- రెరాను ఆశ్రయించిన బాధితులు
- కూటమి ప్రభుత్వం రాకతో నెరవేరుతున్న కల

నేలపాడుకు చేరిన భారీ యంత్రాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిలో సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది లబ్ధిదారుల కల ఇన్నాళ్లకు నెరవేరబోతుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు మంగళం పాడటంతో లబ్ధిదారులు రెరాను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత ఐదేళ్లు లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు చవిచూశారు. ఇక ఆశలు వదులుకోవటమే అనుకున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో హ్యాపీనెస్ట్ బాధితుల మోమున సంతోషం వెల్లివిరిసింది. పనులు ఎప్పుడు మొదలవుతాయా అని గత తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు.

సీఆర్‌డీఏ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు

హ్యాపీనెస్ట్ అనేది సీఆర్‌డీఏ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు. సీఆర్‌డీఏ చేపడుతున్న మొట్ట మొదటి భారీ హౌసింగ్ టౌన్‌షిప్ ఇది. నేలపాడులో మొత్తం 12 టవర్లను హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఒక్కో టవర్ జీ ప్లస్ 18 విధానంలో నిర్మాణం చేపడతారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు పనులు చేపట్టని పాపానికి అంచనా వ్యయం దాదాపుగా రూ.200 కోట్లు పెరిగింది. రూ.818 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా.. ఎన్‌సీసీ, ఎల్‌అండ్‌టీలు ఈ ప్రాజెక్టు కోసం పోటీలు పడ్డాయి. ఎల్‌అండ్‌టీ సంస్థ కంటే ఎన్‌సీసీ సంస్థ 4.68 శాతం ఎక్సెస్ రేటుతో రూ.856.31 కోట్లకు కోట్ చేసి ఎల్-1గా నిలిచి హ్యాపీనెస్ట్ కాంట్రాక్టును దక్కించుకుంది. కేవలం జీ ప్లస్ 18 టవర్ల నిర్మాణమే కాకుండా అత్యద్భుతమైన ఆర్కిటెక్చర్ డిజైన్లతో వీటిని నిర్మించాల్సి ఉంటుంది. షేర్ వాల్ టెక్నాలజీలో నిర్మించాల్సి ఉంటుంది. అల్యూమినియం ఫ్రేమ్ వర్క్, పోడియం, ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్, ఇంటర్నల్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ ఎక్విప్‌మెంట్, ఫైర్ ఫైటింగ్, లిఫ్ట్స్, డీజీ సెట్స్, సెక్యూరిటీ సిస్టమ్స్, ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్, ల్యాండ్ స్కేప్ వంటివి చేపట్టాల్సి ఉంది. మూడేళ్లలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. మరో నాలుగున్నరేళ్ల సమయం ప్రస్తుత ప్రభుత్వానికి ఉండటంతో.. ఇవి పూర్తి కావన్న భయం కూడా లేదు. అత్యాధునిక వసతులతో ట్రిబుల్, డబుల్ బెడ్‌రూమ్‌లతో ఇవి ఉంటాయి. ఇందులో రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, టెన్నిస్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్స్, బిలియర్డ్స్ కోర్టులు, స్పా, బ్యూటీపార్లర్ ఇలా అనేక వసతులు ఉంటాయి.


రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా కందుకూరి పురస్కారం అందుకుంటున్న బెత్తిన శివప్రసాద్, గాజులపల్లి కృష్ణ, జొన్నలగడ్డ జగన్మోహనరావు, ఎస్.ఉదయ్ భాస్కర్, తీట్ల రాజబాబు, బి.జయప్రకాష్

ఆరుగురికి కందుకూరి విశిష్ట సేవ పురస్కారాల ప్రదానం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి 177వ జయంతిని పురస్కరించుకుని బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 113 మందికి రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా కందుకూరి విశిష్ట సేవ పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష బహుమానం, జిల్లాస్థాయి పురస్కారాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున బహుమతులు అందించారు. కృష్ణాజిల్లాకు చెందిన బెత్తిన శివప్రసాద్, గాజులపల్లి కృష్ణ, జొన్నలగడ్డ జగన్మోహనరావు, ఎస్.ఉదయ్ భాస్కర్, తీట్ల రాజబాబు, బి.జయప్రకాష్ తదితరులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టండి

- అధికారులతో కలెక్టర్ డీకే బాలాజీ

6లో

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్

6లో


కుంచే నాని | ఒడుగు తులసీరావు | కొండా ప్రవీణ్‌కుమార్

నాలుగు మార్కెట్ యార్డులకు చైర్మన్ల నియామకం


కొల్లూరి వెంకటేశ్వరరావు

మచిలీపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు మార్కెట్ యార్డులకు చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అవనిగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొల్లూరి వెంకటేశ్వరరావు(టీడీపీ), ఉయ్యూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొండా ప్రవీణ్‌కుమార్ (టీడీపీ), మల్లేశ్వరం మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఒడుగు తులసీరావు(టీడీపీ), మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎస్‌జీఎన్ వెంకటదుర్గాప్రసాద్(కుంచే నాని) (టీడీపీ) నియమితులయ్యారు.

అరాచకవాది

వన్‌టౌన్‌లో పెరిగిపోతున్న న్యాయవాది అరాచకాలు

అతనో న్యాయవాది. కానీ, అతను ఏం కోరుకుంటే అది దక్కి తీరాలి. అనుకున్నది జరిగి తీరాలి. లేకపోతే అరాచకశక్తిగా మారిపోతాడు. తనను కాదనుకున్న వారు తిరిగి కాళ్లు పట్టుకునేలా చేయడానికి కారుతో ఢీ కొట్టడానికైనా వెనుకాడడు. అవసరమైతే న్యాయస్థానాల ప్రాంగణంలోనే బెదిరిస్తాడు. మాట వినకపోతే బంధించి దాడి చేస్తాడు. అతడే వన్‌టౌన్‌కు చెందిన అన్వర్ షేక్. పేరుకు తగ్గట్టుగానే పంజా సెంటర్, వించిపేటను 'షేక్' చేస్తున్న ఇతని పేరును పోలీసులు రౌడీషీట్ జాబితాలో చేర్చారు.

- సన్నిహితురాలితో కలిసి ఆమె భర్త హత్య
- చివరికి ఆమెతోనే గొడవ.. కారుతో ఢీ
- ఫీజు కోసం కక్షిదారులను బంధించి దాడి
- తోటి న్యాయవాదిపైనా బెదిరింపు ధోరణి
- పంజా సెంటర్, వించిపేటలో రౌడీయిజం
- అన్వర్‌పై రౌడీషీట్ తెరిచిన పోలీసులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వన్‌టౌన్‌లోని మహంతిపురానికి చెందిన అస్లాం, కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన అన్వర్ స్నేహితులు. అస్లాం రెండో భార్య నసీమాను అన్వర్ ట్రాప్ చేశాడు. ఇద్దరూ కలిసి అస్లాంపై దాడి చేసి, ఊపిరాడకుండా చేసి చంపేశారు. గుండెపోటుగా చిత్రీకరించారు. అస్లాంది హత్య అని అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు పోరాడినా.. నాడు వైసీపీ నేతల అండదండలు, మంత్రిగా ఉన్న ఓ నాయకుడి సహకారంతో పోలీసులు కేసును పట్టించుకోలేదు. తర్వాత అన్వర్‌ను నసీమా దూరం పెట్టడంతో అస్లాం హత్యకు సంబంధించిన కుట్రను తెలియజేసే సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియో పోలీసుల చేతుల్లో పడటంతో అన్వర్, నసీమాను అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ కేసులో నసీమాను ఇరికించడానికి అన్వర్ ఈ వీడియో విడుదల చేశాడు. ఇక్కడ అతి తెలివి ఉపయోగించడంతో అన్వర్ దొరికిపోయాడు. జైలు మిగతా 6లో..



చంద్రబాబు స్ఫూర్తితో పాడి రైతులకు సేవ

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేనులో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

6లో

కొనుగోలు కేంద్రం లేక అవస్థలు

6లో

మొక్కల పెంపకంపై
దృష్టి పెట్టండి

- అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మొక్కలునాటి, వాటిని సంరక్షించేందుకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభం కాగానే జిల్లాలో రహదారి మార్గాలు, విద్యాసంస్థలు, కాలువలు, చెరువుగట్లపై మొక్కలను నాటి వాటిని సంరక్షించేందుకు ప్రణాళికను రూపొందించాలన్నారు. పంచాయతీల్లో తాగునీటి చెరువుల వద్ద మొక్కలను నాటాలని సూచించారు. మొక్కలను సంరక్షించేందుకు పంచాయతీలో ఒకరికి బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. మూడేళ్లపాటు వీరికి ఉపాధిహామీ పథకం ద్వారా వేతనం చెల్లించేలా చూడాలన్నారు. గ్రామాల్లో 25సెంట్ల భూమిని గుర్తించి, అక్కడ పల్లెవనాలు అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలో ప్రహరీలు ఉన్న 194 పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటాలని సూచించారు. దీర్ఘకాలంపాటు పెరిగి నీడను, ఫలసాయం అందించే మొక్కలను నాటేందుకు డ్వామా పీడీకి వివరాలు అందజేయాలన్నారు. అన్ని దేవాలయాల ఆవరణలు, వాటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, యూనివర్సిటీలలో అక్కడి భూమి పరిస్థితులకు సరిపడే మొక్కలను ఎంపిక చేయాలని సూచించారు. మొక్కలు బతికేందుకు నీటిసదుపాయం కోసం బోర్లను వేయించాలన్నారు. మే 5వతేదీలోగా మొక్కలపెంపకానికి ప్రణాళికను తయారుచేసి నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అటవీశాఖనుంచి మొక్కలను అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, డీఈవో పీవీజే రామారావు, బీసీ సంక్షేమశాఖ అధికారి రమేష్, డీఎఫ్‌వో సునీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం
దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం ద్వారా 2025-26 సంవత్సరంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను పొందేందుకు వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని జేసీ గీతాంజలిశర్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది మూడు విడతల్లో వినియోగదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఏడాదికి ఏప్రిల్ నుంచి జూలై వరకు మొద టి సిలిండర్‌ను, ఆగస్టు నుంచి నవంబరు మధ్య రెండో సిలిండర్, డిసెంబరు నుంచి 2026 మార్చి వరకు మూడో సిలిండర్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. గత ఏడాది నవంబరు నుంచి మార్చి వరకు జిల్లాలో 3,60,500 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించామని తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు 59, 333 సిలిండర్లను ఉచితంగా అందించామని పేర్కొన్నారు.

ఇద్దరు జడ్జిల బదిలీ

మచిలీపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో పనిచేస్తున్న ఇద్దరు జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎ.పద్మను అనంతపురం సీనియర్ సివిల్‌జడ్జిగా బదిలీ చేశారు. ఈ స్థానంలో శ్రీకాకుళం జిల్లా సీనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తున్న ఎల్.హిమబిందును నియమించారు. మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.అరుణను అవనిగడ్డకోర్టు సీనియర్ సివిల్‌జడ్జిగా బదిలీచేశారు. ఈ స్థానంలో శ్రీకాకుళం అదనపు సీనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తున్న సీహెచ్ యుగంధర్‌ను నియమించారు. ఈనెల 30 లోగా బదిలీ అయిన జడ్జిలు బాధ్యతలు చేపట్టాలని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం లేక అవస్థలు

ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

- మద్దతు ధర కంటే తక్కువకు మొక్కజొన్నను కొంటున్న దళారులు.. బస్తాకు రూ.150 నష్టపోతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): మొక్కజొన్న రైతులకు మద్దతు ధర లభించటం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పంటను అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో బస్తాకు రూ.150 వరకు నష్టపోతున్నారు. తోట్లవల్లూరు మండలంలో నాలుగు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగయింది. గత ఏడాది వరదలు వచ్చి వాణిజ్య పంటలను కోల్పోవడంతో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంట తయారైన చేలల్లో 20 రోజుల నుంచి కండెలను కోసి యంత్రం ఆడించి గింజలను ఆరబెట్టి ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,225 మద్దతు ధరను ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు క్వింటా రూ.2,100కు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రూ.2,050కు కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏటా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఇంత వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. వరదలతో పంటలను కోల్పోయి మొక్కజొన్నను సాగుచేస్తే మద్దతు ధర లభించక నష్టపోతున్నామని, ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


వల్లూరుపాలెంలో మొక్కజొన్న కండెలను ఒలుస్తున్న యంత్రం, ఆరబెట్టిన గింజలు

చంద్రబాబు స్ఫూర్తితో పాడిరైతులకు సేవ

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు


దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో మాట్లాడుతున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, చలసాని దంపతులతో కుంభసంప్రోక్షణ జరిపిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నాయకుడిగా ప్రజలకు సేవలందించడంలో క్యారెక్టర్, క్రెడిబిలిటీ, క్రియేటివిటీ ముఖ్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితోనే పాడిరైతులకు సేవలందిస్తున్నానని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ)లో బుధవారం శ్రీసీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, కలశాభిషేక కుంభసంప్రోక్షణ కార్యక్రమాలను శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో చైర్మన్ దంపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. '34 ఏళ్లగా చంద్రబాబునాయుడుతో రాజకీయంగా ప్రయాణిస్తున్నా. అధికారంలో ఉన్నా, లేకున్నా ఆయన స్ఫూర్తితోనే రైతులకు సేవలందిస్తున్నా. ఆయన మనసెరిగే సమైక్యాంధ్ర ఉద్యమం, రైతు ఉద్యమాలు చేశా. ఆయన చేతుమీదుగానే కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ పదవి తీసుకున్నా. రాజకీయ ప్రయాణం వదలి యూనియన్ అభివృద్ధికి పని చేయాలనే ఆయన మాటలనే వేదంగా భావించి యూనియన్‌ను అభివృద్ధి చేశా. పాడిరైతు సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గంతో కలిసి ప్రయాణం చేశా. కరోనా, బుడమేరు వరద లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాలసేకరణ ధర పెంచుతూ, 3 విడతలుగా బోనస్‌లను చెల్లిస్తూ టర్నోవర్‌ను రూ.1300 కోట్లకు పెంచాం. ఇది పాడిరైతులందరి సహకారంతోనే సాధ్యమైంది.' అని చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. తదనంతరం దేవస్థాన నిర్మాణ స్థపతికి, అత్యధిక బోనస్ సాధించిన పాల సంఘాలకు బోనస్ చెక్కులను చినజీయర్‌స్వామి చేతులమీదుగా పంపిణీ చేశారు. లైలా గ్రూప్ చైర్మన్ గోకరాజు గంగరాజు, గజల్ శ్రీనివాస్, గొట్టిపాటి శివరామకృష్ణ ప్రసాద్, నూతక్కి వేణు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దేశానికి అన్నపూర్ణగా ఏపీని నిలపాలి: త్రిదండి చినజీయర్‌స్వామి

మేలుజాతి వంగడాలతో సారవంతమైన పంటలతో దేశానికి అన్నపూర్ణగా నిలచిన ఆంధ్రప్రదేశ్ కొంత కాలంగా దిగజారుతోంది. రైతన్నలందరూ కలిసికట్టుగా నేల సారం తగ్గకుండా మేలు జాతి పంటలతో మొదటిస్థానం సాధించాలి.' అని త్రిదండి చినజీయర్ స్వామి సూచించారు. అధిక దిగుబడుల కోసం ఎరువులు అధిక మోతాదులో వినియోగించకుండా సారవంతమైన విత్తులతో మంచి పంట పండించాలని సూచించారు. పాడిరైతులకు అత్యధిక ధర చెల్లిస్తూ చలసాని ఆంజనేయులు సారధ్యంలోని కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆయన అన్నారు. విదేశాల్లో స్థిరపడిన వారు తప్పనిసరిగా మూలాలను చేసుకోవాలని, ప్రతి సంవత్సరం క్షేత్రస్థాయిలో పాడి-పంటలను పరిశీలించాలని సూచించారు.

విధేయతకు పట్టం

- దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 'కొల్లూరి' నియామకం


కొల్లూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆ పార్టీపై చేసిన పోరాటాలు, పార్టీ పట్ల చూపిన విధేయతకు గుర్తింపుగా దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని టీడీపీ సీనియర్ నేత కొల్లూరి వెంకటేశ్వరరావుకు పార్టీ అధిష్ఠానం కట్టబెట్టింది. పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా పని చేస్తున్న కొల్లూరి గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై నియోజకవర్గంలో పలు పోరాటాలకు నాయకత్వం వహించారు. కొల్లూరి నియామకంపై నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎస్ఆర్ఐ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్, అవనిగడ్డ నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావునుఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తన కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు.

అంచెలంచలుగా ఎదిగిన కుంచే నాని

మచిలీపట్నం టౌన్: టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న కుంచే శ్రీగురునాథ వెంకట దుర్గాప్రసాద్(నాని) అంచెలంచెలుగా ఎదిగి మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులయ్యారు. తెలుగు యువత బందరు మండల అధ్యక్షుడిగా, టీడీపీ జిల్లా కార్యదర్శిగా ఆయన సేవలందించారు. ప్రస్తుతం టీడీపీ బందరు మండల అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. కుంచే నానికి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కొండా ప్రవీణ్ సేవలు గుర్తించిన అధిష్ఠానం

ఉయ్యూరు: ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గండిగుంటకు చెందిన కొండా ప్రవీ ణ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ గతంలో పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచే శారు. సార్వత్రిక ఎన్నికల్లో బోడె ప్రసాద్ విజయానికి , ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి విశేష కృషిచేశారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

గన్నవరంలో అక్రమ మైనింగ్ ఉండదు

- ఇక అంతా సక్రమమే..
- ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం చేసిన గత పాలకులు
- ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే సహించం
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'గన్నవరం నియోజకవర్గంలో ఇక మీదట అక్రమ మైనింగ్ ఉండదు. అంతా సక్రమంగానే ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరంలో మైనింగ్ మాఫియా అడ్డగోలుగా అక్రమ తవ్వకాలు జరిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజిలెన్స్ విచారణ జరిపేందుకు వీలుగా ప్రస్తుతం మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం లేదు. అనుమతులు ఇచ్చాక అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. అంపాపురంలో పంచాయతీ భవనాన్ని బుధవారం ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడారు. కక్షసాధింపు చర్యలు తనకు తెలియదన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమన్నారు. ట్రిపుల్‌ఐటీ గచ్చిబౌలిని గన్నవరం తీసుకొచ్చేందుకు అందరితో మాట్లాడి ఒప్పిస్తే మేధా టవర్స్‌లో ఖాళీగా ఉన్న 37వేల చదరపు అడుగుల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అనుమతి వచ్చిందన్నారు. తర్వాత గన్నవరం విమానాశ్రయానికి దగ్గరలో 30 ఎకరాల భూమిని వారికి చూపించలేని పరిస్థితి ఉందన్నారు. గత పాలకుల దుర్మార్గం వల్ల ప్రభుత్వ భూములన్నీ ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఉమామహేశ్వరపురంలోని శ్మశానవాటిక భూమిని అక్రమించారని అక్కడి నాయకులు ఫిర్యాదు చేశారని, రెండు రోజుల్లో ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ ఆస్తుల వ్యవహారంలో గతంలో తప్పుచేసిన అధికారులను వదిలిపెట్టబోమన్నారు. గతంలో అక్రమ మైనింగ్ జరిగిన మాట వాస్తవమేనని, విజిలెన్స్ ఎంక్వయిరీ జరిగిందని, సిట్ ఎంక్వయిరీ జరుగుతోందని దానిపై తనకు స్పష్టత లేదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాలసీ తీసుకున్న తరువాత గ్రావెల్ అందుబాటులోకి వస్తుందన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో వారిలాగా మాకు కమీషన్లు అక్కర్లేదని నియోజకవర్గంలోని యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు మాత్రమే కావాలని పారిశ్రామికవేత్తలను కోరానన్నారు. పారిశ్రామికవాడలో సమస్యలను సింగిల్ విండో ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఐటీ ఉద్యోగాలు తప్ప మిగిలిన ఉద్యోగావకాశాలన్నీ నియోజకవర్గ యువతకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల స్థలాల కోసం అసెంబ్లీ వేదికగా ప్రశ్నించానన్నారు. నున్నలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఆలోచించుకోవాలని, గోడలు కట్టినా గోడకు కొట్టిన సున్నంలా వృథా అవుతుందని హెచ్చరించారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- డ్రోన్ కెమెరాల సాయంతో అసాంఘిక కార్యకలాపాలు అరికడతాం: ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి అమ్మే వారిపై, గంజాయి రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం మచిలీపట్నం పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులను కంప్యూటర్ ద్వారా అప్‌డేట్ చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత ఘర్షణలకు ఆస్కారం లేకుండా మత సామరస్యానికి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర చేస్తూ సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గన్నవరం పరిధిలో జరిగిన కేసును సత్వరం విచారించి నిందితులపై చర్యలు తీసుకున్నామన్నారు. డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యక్రమాలను అరికడతామన్నారు. మడ అడవులపై డ్రోన్ కెమెరాలు ఉంచి నాటుసారా తయారీదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తున్నామన్నారు. గూడూరు, తరకటూరు ప్రాంతాల్లో ప్రమాదాలను అరికట్టేందుకు ప్లాస్టిక్ డ్రమ్ములు, బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ గ్రామాల్లో రైతులతో మాట్లాడి పశువులను రోడ్డు దాటివడంపై సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు నబి, సాయిబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

అరాచకవాది

(5వ పేజీ తరువాయి)

నుంచి బయటకు వచ్చాక అన్వర్ కొత్త అవతారమెత్తాడు. నల్లకోటు ధరించి న్యాయవాదిగా మారాడు. ప్రముఖ న్యాయవాదిలా రెండు సంచుల్లో చట్టాలకు సంబంధించిన పుస్తకాలను తీసుకుని నిత్యం కోర్టుకు వెళ్లడం మొదలుపెట్టాడు. అస్లాం హత్యకు సంబంధించి కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు కోర్టు విచారణలో ఉంది.

న్యాయవాదికి బెదిరింపులు

అస్లాం హత్య కేసులో ఆయన భార్య ఫాతిమా మొదటి నుంచి పోరాడుతోంది. ఈ కేసును వాదిస్తున్న న్యాయవాదిపై అన్వర్ న్యాయస్థానాల ప్రాంగణంలోనే బెదిరింపులకు దిగాడు. విచారణలో భాగంగా నసీమాను ఆ న్యాయవాది విచారణ చేశారు. ప్రశ్నలు సంధించారు. ఈ విషయం తెలుసుకున్న అన్వర్ ఏకంగా ఆ న్యాయవాది వద్దకు వెళ్లి బెదిరించాడు. ఆయన అంతుచూస్తానని హెచ్చరించాడు. న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదుతో సూర్యారావుపేట పోలీసులు అన్వర్‌పై కేసు నమోదు చేశారు.

రూ.50 వేల కోసం బంధించి..

విశాఖపట్నానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు.. ఎయిర్ హోస్టెస్ ఉద్యోగాల పేరుతో పలువురు నిరుద్యోగులను మోసం చేశారు. బాధితులంతా సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విశాఖలో ఉన్న అక్కాచెల్లెళ్లను విచారణకు పిలిపించారు. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపుతారన్న భయంతో బెయిల్ కోసం వారు అన్వర్‌ను సంప్రదించారు. తర్వాత నిర్ణయం మార్చుకుని మరో న్యాయవాది వద్దకు వెళ్లారు. ఆ అక్కాచెల్లెళ్లకు అన్వర్ ఎలాంటి సాయం చేయలేదు. కోర్టులో ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. వారు తనను సంప్రదించినందుకు ఫీజుగా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. దీనికి అక్కాచెల్లెళ్లు ఇద్దరూ ఎదురుతిరిగారు. దీంతో తన బలాన్ని ఉపయోగించుకుని వారిని బంధించి దాడి చేశాడు. వారి ఫోన్ల నుంచి పేమెంట్ యాప్ ద్వారా రూ.50 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. దీనిపై వారు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాదిపై కేసు ఎలా నమోదు చేస్తారని ఇతర న్యాయవాదులను రెచ్చగొట్టాడు. అన్వర్‌ను అరెస్టు చేసినందుకు వాళ్లంతా పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నానా హంగామా సృష్టించారు.

కారుతో బీభత్సం

తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదన్న సిద్ధాంతం అన్వర్‌ది. నసీమా సోదరి కుమార్తె, అల్లుడు హైదరాబాద్‌లో ఉంటారు. రంజాన్ షాపింగ్ కోసం హైదరాబాద్ వెళ్లిన నసీమా వారితో కలిసి విజయవాడకు వచ్చింది. కారులో నసీమా, ఆమె సోదరి కుమార్తె, అల్లుడు ఉన్నారు. మహంతిపురంలో ఈ కారును చూడగానే అన్వర్‌కు పూనకాలు వచ్చాయి. ఒక్కసారిగా అతడు తన కారుతో నసీమా ఉన్న కారును ఢీకొట్టాడు. ఈ క్రమంలో అక్కడున్న ద్విచక్ర వాహనాలను తుక్కుతుక్కు చేశాడు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసుల జాబితా

క్రైం నెంబరు 187/2015తో ఐపీసీ 506, 323, 324, 509 కింద భవానీపురంలో ఓ కేసు నమోదైంది. అలాగే, క్రైం నెంబరు 51/2022తో సీఆర్పీసీ 174గా ఉన్న కేసును ఐపీసీ 302, 202 కింద కొత్తపేట పోలీసులు మార్పు చేశారు. క్రైం నెంబరు 84/2022తో ఐపీసీ 153 కింద కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 203/2023తో ఐపీసీ 341, 506 రెడ్‌విత్ 34 కింద సూర్యారావుపేట పీఎస్‌లో కేసు నమోదైంది. క్రైం నెంబరు 88/2025తో బీఎన్ఎస్ 140(2), 127(2), 115(2), 308(2) రెడ్‌విత్ 3(5) కింద సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబరు 126/2025తో బీఎన్ఎస్ 281, 324(3) కింద కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నేలరాలిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

సాగు చేస్తారు. వరుసగా మూడేళ్ల నుంచి నష్టాలు చవిచూస్తున్న రైతుల్ని ఈ ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. పంట చేతికొచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలిపోయాయి. మైలవరం మండలం గణపవరం గ్రామంలో రాలిన మామిడి కాయలు కొనే నాథుడు లేక రోడ్ల పక్కన పడేస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో ఉన్నాం..

ఈ ఏడాది పెట్టుబడి అధికంగా పెట్టాం. ప్రతికూల వాతావరణం వల్ల కాపు తగ్గింది. మే నెలలో రావాల్సిన గాలి, దుమ్ము ఈనెల మొదటి వారంలోనే రావడంతో కోత కోయకుండానే కాయలు రాలిపోయాయి. ఉన్న కాయలు కోసినా కోత ఖర్చులు వచ్చేలా లేవు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పగడాల సత్యనారాయణ, నాగులూరు

అప్పులెలా తీరుతాయో...

మూడెకరాల్లో మామిడి సాగు చేశాను. ఇప్పటికి 9 సార్లు మందులు పిచికారీ చేశాను. మందులకే రూ.1.5 లక్షలు ఖర్చు చేశాను. గాలులకు మూడొంతుల మామిడి కాయలు నేలరాలాయి. కాయలు కోత దశలో ఉన్న సమయంలో గాలులు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మిగిలిన పావువంతు కాయలతో అప్పులెలా తీర్చాల్లో తెలియట్లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- రాయల సురేష్, తెల్లదేవరపల్లి

తీవ్రంగా నష్టం చేశాయి

ఈదురుగాలులు తీవ్రంగా నష్టపరిచాయి. ఆరు ఎకరాల్లో కాయలు రాలిపోయాయి. రూ.6 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. ఎంతో కష్టపడి పండించాం. కాపు తక్కువ అయినా ధర వస్తుందని ఆశించాం. చేతికొచ్చిన పంట ఇలా గాలులకు నేల పాలు కావడం జీర్ణంచుకోలేకపోతున్నాం. ఒకే నెలలో నాలుగు సార్లు ఈదురుగాలులు రావడం ఇదే మొదటిసారి.

- శీలపురెడ్డి రామిరెడ్డి, కోకిలంపాడు

డ్వాక్రా గ్రూపు రద్దు

యనమలకుదురు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు నిర్వాకం

- సభ్యులకు తెలియకుండా పొదుపు డబ్బు లోనుకు జమ
- ఆర్పీ, గ్రూపు లీడరు, మేనేజరుపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సభ్యులు

పెనమలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు పరిధిలోని ద్రాక్షాయణి డ్వాక్రా గ్రూపును యనమలకుదురు శివాలయం దగ్గరలోని సప్తగిరి బ్యాంకు మేనేజరు తొలిగించివేశారు. తీసుకున్న లోను, పొదుపు సొమ్మును సవ్యంగా నెలవారీ కడుతున్నా అకారణంగా సభ్యులకు సమాచారం లేకుంగా గ్రూపును బ్యాంకు మేనేజరు శేషబ్రహ్మ రద్దు చేశారు. అప్పటి వరకు పొదుపు చేసుకొన్న డబ్బును లోన్‌కు జమచేశారు. ఇదంతా జరిగి మూడు నెలలు అవుతున్నా బయటికి లీకు కాకుండా జాగ్రత్త తీసుకున్నారు. గత వారం పొదుపు డబ్బులు కట్టేందుకు బ్యాంకుకు వెళ్లిన గ్రూపు సభ్యులు ఈవిషయం తెలుసుకుని షాకయ్యారు. మేనేజరు, గ్రూపు లీడరు షబానా, ఆర్పీ శివనాగమణిలపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడిగినంత డబ్బులు ఇవ్వకపోవడంతోనే..

వైసీపీ నేతల సిఫారసులతో నియమించిన ఆర్పీలే ఇప్పటికీ యనమలకుదురు పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్నారు. సంఘాల్లోని సభ్యులు అడిగినంత కమీషన్ ఇవ్వలేదని ఆర్పీలు అనేక గ్రూపులను రద్దు చేస్తున్నారు. తాజాగా ద్రాక్షాయణి గ్రూపు సభ్యులు తీసుకున్న రుణానికి కిస్తీలు సక్రమంగా కడుతున్నప్పటికీ ఈ గ్రూపునకు ఆర్పీగా ఉన్న నాగమణి, మేనేజరు, మొదటి లీడరు కలిసి రద్దు చేశారు. మొదటి లీడరు పరారీలో ఉన్నారు. ఆమెకు సహకరించిన ఆర్పీని సభ్యులు అడిగితే తనకు రాజకీయ అండదండలు ఉన్నాయి. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇవ్వలేదనే కారణంతోనే గ్రూపును రద్దు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.1.6 లక్షల పొదుపు సొమ్మును వారు తమ వద్ద కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బంగారం చోరీ కేసు దర్యాప్తు వేగవంతం

- పోలీసుల అదుపులో ముగ్గురు!


మహామండపం నాలుగో అంతస్తులో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న సీఐ గురుప్రకాశ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు దుర్గగుడి ఘాట్ రోడ్డులో చోరీ కేసు దర్యాప్తును వన్‌టౌన్ సీఐ గురుప్రకాశ్ వేగవంతం చేశారు. హైదరాబాద్ బృందావన్ కాలనీకి చెందిన బిల్డర్ ఆచంట దుర్గారావు కుటుంబసభ్యులతో కలిసి కారులో మంగళవారం దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. కారును ఘాట్ రోడ్డు ఓం టర్నింగ్ వద్ద పార్కింగ్ చేశారు. దర్శనం అనంతరం వచ్చి చూడగా కారులో భద్రపరిచిన 241 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ జరగడంపై బాధితుడు వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సీఐ గురుప్రకాశ్ సిబ్బందితో కలిసి బుధవారం మహామండపంలో ఉన్న సీసీ కెమెరా రూమ్‌లో సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. బాధితుడు కారు దిగి డోర్ లాక్ చేయకుండానే దర్శనానికి వెళ్లినట్టు తెలుస్తోంది. క్లూస్ టీమ్ కారుపై ఆరు రకాల ఫింగర్ ప్రింట్ నమూనాలను సేకరించారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే పాత నేరస్థుల్లో కొందరిపై పోలీసులు నిఘా పెట్టినట్టు తెలిసింది. త్వరలో నిందితులను పట్టుకునే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

వంట గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ వినియోగించేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలని జంక్షన్ అగ్నిమాపకాధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక నూజివీడు రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో గ్యాస్ వినియోగించినపుడు ఎదురైన ప్రమాదాలు.. వాటిని నివారించే విధానాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి రామ్మోహన్‌రావు

అరకొర సౌకర్యాలు.. అందని వైద్యసేవలు

- పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ఠ
- కేసరపల్లిలో మూతబడిన ఆరోగ్య ఉపకేంద్రం
- గన్నవరం సీహెచ్‌సీలో మందుల కొరత
- చాలీచాలని గదులతో ఇక్కట్లు
- మూతబడిన కొయ్యగూరపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి
- అసంపూర్తిగా నిలిచిపోయిన ఆత్కూరు పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం



ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. పెదఅవుటపల్లి పీహెచ్‌సీ

గన్నవరం / ఉంగుటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారు లక్ష మందికిపైగా జనాభా ఉన్నారు. గన్నవరంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాదలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 11 గ్రామాలకు పెద్ద అవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల నుంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ముస్తాబాద పీహెచ్‌సీ పరిధిలో మాదలవారిగూడెం, సూరంపల్లి, జక్కుల నెక్కలం, సావరగూడెం, కేసరపల్లి, గన్నవరం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపు గూడెం, ముస్తాబాద గ్రామాలు ఉండగా 61వేల మంది జనాభా ఉన్నారు. నలుగురు వైద్యులు ఉండాల్సిందిగా ఒకరు డిప్యూటేషన్‌పై సీఎంకు వెళ్లారు. హాస్పిటల్ భవనం కొత్తగా నిర్మించారు. అయితే ఉన్న జనాభాకు వైద్యులు కొరత ఉంది. కేసరపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రం శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దాని గురించి పట్టించుకునే నాథుడే లేరు. గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన కొన్ని మందులు అందుబాటులో ఉండటం లేదు.

ఉంగుటూరు మండలంలో నాలుగు పీహెచ్‌సీలు, రెండు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు వున్నాయి. తేలప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధునీకరించబడి పూర్తిస్థాయిలో వైద్యసేవలందిస్తుండగా, కొయ్యగూరపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఏడాదిన్నర కాలంగా మూతపడింది. ఆత్కూరు, ఇందుపల్లి, ఉంగుటూరు, పెదఅవుటపల్లి పీహెచ్‌సీల పరిధిలో 24 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలుండగా గన్నవరం, ఉంగుటూరు మండలాలకు చెందిన 45గ్రామాల ప్రజలు ఆరోగ్యవైద్య సేవలు పొందుతున్నారు. ●ఆత్కూరు పీహెచ్‌సీ నూతనభవన నిర్మాణం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవటంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. ● పెదఅవుటపల్లి పీహెచ్‌సీలో మందులు స్టాక్‌చేసుకునేందుకు స్టోర్‌రూమ్, లేబర్‌రూమ్‌కు అటాచ్‌డ్ బాత్‌రూమ్ లేని కారణంగా పేషెంట్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ● ఇందుపల్లిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. త్రీఫేజ్ కరెంట్ కనెక్షన్ లేదు. పాతపీహెచ్‌సీనే స్టోర్‌రూమ్‌గా వాడుకుంటున్నారు. ● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నారా లోకేశ్ ఉంగుటూరు నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 90శాతం పనులు పూర్తవడంతో 2023లో కొత్తపీహెచ్‌సీని ప్రారంభించి వైద్యసేవలను అందిస్తున్నారు. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో డూమ్‌సిస్టమ్ ఏర్పాటు, ఆపరేషన్ థియేటర్ ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ పనులను కాంట్రాక్టర్ నిలుపుదల చేశాడు.

గీతా మందిరంలో మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నున్న గీతా మందిరంలో ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు మహాసంప్రోక్షణ, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు గీతా మందిరం భక్త బృందం కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గీతామంది రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సంప్రోక్షణ, కుంభాభిషేక కార్యక్రమాల గురించి పలు వివరాలను తెలిపారు. గీతా మందిరంలో శ్రీకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠిచి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా ఏర్పేడులోని శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరిస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ చెన్నుబోయిన సీతామహాలక్ష్మి

కె.సీతారాంపురంలో ఆర్వో ప్లాంట్ పునఃప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు శుద్ధమైన తాగునీరందించేందుకు ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిం చినట్టు సర్పంచ్ చెన్నుబోయిన సీతామహాలక్ష్మి అన్నారు. కె.సీతారాంపురంలో ఎంపీ నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంటును బుధవారం పునఃప్రారంభించారు. ఆర్వో ప్లాంట్ ద్వారా రూ.5కే ప్యూరిఫైడ్ నీటిని అందిస్తున్నామని, ప్రతి నెలా గన్నవరంలో నీటిని పరీక్షల నిమిత్తం పంపుతామని కార్యదర్శి స్వాతి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ, టీడీపీ అధ్యక్షుడు చెన్నుబోయిన శివనాగరాజు, కార్యదర్శి ప్రొద్దుటూరు గంగరాజు, అచ్చన వెంకటేశ్వరరావు, ఎనికెపల్లి శ్రీనివాస్, చౌటపల్లి భాగ్యరాజు పాల్గొన్నారు.


ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

సర్వీసులు పెంచాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు ఆర్టీసీ డిపోకు బస్సులు కేటాయించి సర్వీసులు పెంచడంతో పాటు డిపో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కలసి వినతిపత్రం అందజేశారు. బుధవారం చైర్మన్ కార్యాలయంలో కలసి ఉయ్యూరు డిపోలో సమస్యలు, బస్సుల పరిస్థితి, సర్వీసుల కుదింపు, నూతన బస్సులు, నూతన సర్వీసుల ఆవశ్యకతను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఉయ్యూరు పరిసర గ్రామాల నుంచి రైల్వేస్టేషన్‌కు డిపో బస్సులు నడపాలన్నారు. వాడపల్లి ఇతర పుణ్యక్షేత్రాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకుని డిపో అభివృద్ధి బాటలో నడిచేందుకు సహకరించాలని చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గంలో షుమారు రూ. 26 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సాయిపురంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం భవనానికి శంకుస్థాపన చేసి, సీసీ, బీటీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, సాయిపురంలో సవంత్సర కాలంలో రూ. 3.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎగినపాడు నుంచి సాయిపురం మీదుగా ముదునూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు, సాయిపురం మద్రివాడ రోడ్డు అభివృద్ధి జరిగిందన్నారు. పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన సీతారామాంజనేయులు అభినందనీయులన్నారు. సర్పంచ్ జాన్ బాషా, ఎంపీపీ చీలి కల్పన, బొల్లపాడు ఎంపీ టీసీ గంగారత్నం, ఎంపీడీఓ శేషగిరిరావు, వి సత్యనారాయణ, కుటుంబరావు, జబర్లపూడి సర్పంచ్ శేషవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రూ. 4.88 కోట్లతో ఆకునూరు- కడవకొల్లు, నాగన్నగూడెం రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.


సాయిపురంలో పంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దశల వారీగా మునిసిపాలిటి అభివృద్ధి

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీని ఒక క్రమ పద్ధతి లోదశల వారీగా అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం పోరంకి మహాలక్ష్మీనగర్‌లో రూ. 32లక్షల సాధారణ నిధులతో 3వ, 5వ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ ఆర్థిక అరాచకాల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్పటికీ రాష్ట్రంలో గుంతల రోడ్లను పూడ్చి అవసరమైన చోట్ల కొత్త రోడ్లు, డ్రైనేజీలనునిర్మించడానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, గుంతలు పూడ్చే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కమిషనర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, సరళ

పెనమలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, సరళ కోరారు. సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మునిసిపల్ కార్మికులు తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్ సమస్యలను ప్రభుత్వం ఇంతవరకు పరిష్కరించలేదని, రెండేళ్లు అవుతున్నప్పటికీ కార్మికులకు హెల్త్ అల వెన్సు, సమ్మెకాలంలో డబ్బులు గానీ రాలేదని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరి మునిసిపల్ కార్మికుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రిటైరైన కుటుంబాల నుంచి చనిపోయిన వారి కుటుంబాల నుంచి ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో సమ్మెకు దిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, చొప్పవరపు రత్నకర్ల, డేవిడ్‌రాజ్, బిక్షాలు, దుర్గారావు, బుజ్జులు, జోజిమేరీ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో అంగవైకల్యాలు

పెనమలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లల్లో, విద్యార్థుల్లో పోషకాహార లోపాలవల్ల అంగవైకల్యాలు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ వ్యాప్త దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, పోషకాహార లోపాలు కలుగకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలద్వారా, వివిధ మాతా శిశు సంక్షేమ పథకాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, ఉయ్యూరు డిప్యూటీ ఈఓ పద్మరాణి, ఎంపీడీవో ప్రణవి, పెనమలూరు ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, కంకిపాడు ఎంఈవో ప్రసాదరావు, హెచ్ఎం దుర్గాభవాని రాంబాబు పాల్గొన్నారు.

పోషణ్ ట్రాకర్‌పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన

కంకిపాడు ఐసీడీఎస్ పరిధిలోని యనమలకుదురు సెక్టర్, యనమలకుదురు గ్రామంలోని 12వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం అంగన్‌వాడీ పరిధిలోని లబ్ధిదారులకు పోషణ్ ట్రాకర్‌పై అవగాహన కల్పించారు. ట్రాకర్‌లో స్వయంగా లబ్ధిదారులు నమోదు చేసేలా, సామ్, మామ్, ఒబెసిటీ ఉన్న పిల్లలకు పోషకాహారాన్ని అందించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళ్యాణి వర్మ, ఖాసిం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గుణదల : గర్భిణులు బిడ్డను కనేంత వరకు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం అన్నారు. ప్రసాదంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహార పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రసాదంపాడు రామాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జి.మంగమ్మ, సూపర్‌వైజర్ ఎస్. స్వర్ణకుమారి, ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి జె.రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త సత్యవతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కళాశాల కన్వీనర్ పాలడుగు సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు

దంత వైద్య విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దంత వైద్య విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని కళాశాల కన్వీనర్ పాలడుగునాగసాయి మధుసూదనరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఎండీఎస్ విద్యార్థులు ఇటీవల ఆగ్రా ఐసీడీఈ నేషనల్ పిజి కన్వెన్షన్‌లో జరిగిన పేపర్ ప్రజంటేషన్ కేటగిరిలో తృతీయ సంవత్సర విద్యార్థిని డాక్టర్ వై.ఇందుమతి మొదటి స్థానం, ద్వితీయ సంవత్సర విద్యార్థిని డాక్టర్ పూజిత మహాదేవు ద్వితీయ స్థానం సాధించింది. బుధవారం ఇద్దరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏవో వైమధు సూదనరావు, హెచ్ఓడీ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 33 మంది ఎంపిక

ఉయ్యూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా కళాశాల ఉపాధి విభాగం, దివీస్ లేబరేటరీస్ బుధవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 33 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సెలక్షన్‌కు 47 మంది హాజరుకాగా అందులో 12 మంది డిగ్రీ, 21 మంది పీజీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దివీస్ లేబరేటరీస్ హెచ్ ఆర్ కె శ్రీహరి కృష్ణ, జూనియర్ హెచ్‌ఆర్ కె ప్రతాప్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం శివనాథ్, ప్రత్యేక అధికారి కె సత్యనారాయణ, ఉపాధి శిక్షణ అధికారి అనిల్‌కుమార్, కిషోర్, గిరిప్రసాద్ అభినందించారు.

యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పిస్తూ గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంపాపురంలో ఎంపీ కేవీపీ రామచంద్రరావు నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలిసి ప్రారంభించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువుగట్లను పటిష్టపరిచే కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కేవీపీతో 2005 నుంచి పరిచయం ఉందని అంపాపురం గ్రామా భివృద్ధికి ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. గన్నవరం నియోజకరవర్గ అభివృద్ధికి కోల్ ఇండియా చైర్మన్‌ను సీఎస్సార్ నిధులు అడగ్గా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. అంపాపురంలో 24గంటల విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు యార్లగడ్డను కోరారు. 48 గంటల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలని అక్కడే ఆ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికల్యాణి, చిరుమామిళ్ల సూర్యం, కోటగిరి కృష్ణమోహన్, సర్పంచ్ కాకాని సంజయ్, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, యాళ్ల శ్రీధర్, లింగం శ్రీధర్, చిన్నాల చిన్నా, ఆరుమళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


అంపాపురంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

● మడిచర్ల, కానుమోలులో ఎన్నార్జీఎస్ నిధులతో నిర్మించిన రహదారులను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకం నిధుల ద్వారా రూ. 80లక్షలతో నిర్మించిన మడిచర్ల ప్రధాన రహదారిని, కానుమోలు బీసీ కాలనీలో రూ.23లక్షలతో నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించారు.

విద్యుత్ సమస్యకు గంటల్లోనే పరిష్కారం

అంపాపురంలో సగం గ్రామానికి విద్యుత్ తొమ్మిది గంటలే వస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లిన గంటల వ్యవధిలోనే విద్యుత్ సిబ్బంది పనులను మొదలు పెట్టారు. పంచాయతీ భవనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఎన్నో సంవత్సరాలుగా తాము పడుతున్న విద్యుత్ సమస్య గురించి గ్రామస్థులు వివరించారు. అప్పటికప్పుడే 48గంటల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నుంచి ఏఈ మురళీకృష్ణ పర్యవేక్షణలో విద్యుత్‌శాఖ సిబ్బంది పనులు మొదలు పెట్టారు. 24గంటల విద్యుత్ అందేలా చర్యలు తీసుకున్నట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ సీఐటీయు, ఏఐటీయూసీ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన శిబిరంలో సీఐటీయూ నాయకుడు బి. సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకుడు వై. ఈశ్వరరావులు మాట్లాడారు. కార్మికుల వయోపరిమితిని 62కు పెంచాలన్నారు. సర్వీసులో మృతిచెందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఏళ్లతరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు సీహెచ్. బుల్లెమ్మ, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, లంకా రాజు, భట్రాజు సుబ్బారావు, యర్రంశెట్టి విజయ పాల్గొన్నారు.



స్వామివార్లకు పూజలు నిర్వహిస్తున్న మండలి వెంకట్రామ్, సీఐ యువకుమార్

రాములోరిని దర్శించుకున్న ప్రముఖులు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మోదుమూడి రామాలయంలోని రాములోరిని స్థానిక ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, సీఐ యువకుమార్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్‌లు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందికి భారీ అన్నసమారాధన చేశారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

మోపిదేవి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధమైన సంఘటన పెదప్రోలు పంచాయతీ శివారు శివరామపురంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వాతావరణంలో మార్పుల కారణంగా బుధవారం తెల్లవారుజామున వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఎగసి పడిన మంటలకు 40 సెంట్ల అరటితోట పూర్తిగా దగ్ధమైంది. వెంకటాపురానికి చెందిన గంజాల పరంధామయ్య పొలాన్ని లీజుకు తీసుకుని అరటి తోట సాగు చేస్తున్నారు. తోట దగ్ధం కావటంతో 40 వేలకుపైగా నష్టం వాటిల్లినట్లు కౌలు రైతు చెబుతున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ఘంటసాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన ఉచిత హోమియో వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో గుడివాడకుచెందిన గురురాజు హోమియోపతి వైద్యులు డాక్టర్ శ్రీదేవి, నందిని, సుమిత్రి, శర్మలు 120 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి మూడో బుధవారం వైద్యశిబిరం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

వేద పాఠశాల ఏర్పాటు

ఘంటసాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని తాడేపల్లి పెద్దాశ్రమంతో వేద పాఠశాల ఏర్పాటుకు ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకట్రావు - సావిత్రి దంపతులు సంసిద్ధత వ్యక్తం చేశారు. బుధవారం ఆశ్రమ నిర్వాహకుడైన చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి అస్సంగానంద గిరి స్వామికి తమ అంగీకారం తెలియజేశారు. వేద పాఠశాల ఏర్పాటుకు అవసరమైన ఖర్చు అంతా తామే భరిస్తామని, అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మూల్పూరి వెంకట్రావు దంపతులను స్వామిజీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కావూరి కోదండ రామయ్య, గొర్రెపాటి సురేష్, మొవ్వ శ్రీరామ్మూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వేపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

రీ సర్వేకు సహకరించండి

కోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని కోడూరు మండల తహసీల్దార్ శ్రీను నాయక్ కోరారు. మాచవరంలో భూముల రీ సర్వేకు సంబంధించి గ్రామ సచివాలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన రహదారుల వెంబడి రెవెన్యూ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

జై ఆంధ్ర ఉద్యమకారుడు చంచలరావు

కుటుంబ సభ్యులకు పరామర్శ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతిచెందిన జై ఆంధ్ర ఉద్యమకారుడు చంచలరావు కుటుంబ సభ్యులను బుధవారం బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెంచలరావు మచిలీపట్నానికి అందించిన సేవలు మరువలేనివన్నారు.



అరకొర వసతులు.. పేదలకు అందని వైద్యం

ఘంటసాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పీహెచ్‌సీలో పెద్దలకు తప్ప పేదలకు సరైన వైద్యం అందటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైద్యం కోసం వెళ్లిన పేదల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ రాత్రి వేళల్లో వైద్య సహాయం కోసం వెళ్తే వైద్యులు అందుబాటులో లేకపోవటంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్వయంగా ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం హాజరును ఫేస్ రికగ్నైజింగ్ యాప్‌లో నమోదు చేయాలని తెలపటంతో ఉదయం 9 గంటల నుంచి వచ్చి యాప్‌లో నమోదు చేసుకున్న అనంతరం బయటికి వెళ్లిపోతున్నట్టుగా పలువురు ఆరోపిస్తున్నారు. శ్రీకాకుళం పీహెచ్‌సీలో రెండు డాక్టర్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం ఒక్కరే వైద్యసేవలు అందిస్తున్నారు. బుధవారం 80కిపైగా ఓపి వచ్చినట్లుగా సిబ్బంది రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో వైద్యసేవలు అందించటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



శ్రీకాకుళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. రైలుపేటలో అద్దె భవనంలో..

అద్దె భవనంలో రైలుపేట అర్బన్ పీహెచ్‌సీ

● మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీ

(మచిలీపట్నం టౌన్ , ఆంధ్రజ్యోతి)

మచిలీపట్నంలోని రైలుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అద్దె భవనంలో నడుస్తోంది. ఆ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసరు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అర్బన్‌హెల్త్ సెంటర్‌లో కీలకమైన పోస్టు ఖాళీగా ఉండటంతో బందరుకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లోని మెడికల్ ఆఫీసర్ మూడ్రోజులు రైలుపేటలోనూ, మూడ్రోజులు బందరుకోటలోనూ విధులు నిర్వహించే విధంగా ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.కాగా గిలకలదిండిలోని అర్బన్ హెల్త్ సెంటర్ ప్రభుత్వ భవనంలో నడుస్తోంది. చిలకలపూడి, వర్రెగూడెం, శారదానగర్‌లలోని అర్బన్ హెల్త్ సెంటర్లకు రిపేర్లు చేయించాల్సి ఉంది. కాగా చిలకలపూడి, వర్రెగూడెం, శారదానగర్‌లలో స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ కేంద్రాల్లో పనిభారం ఎక్కువవుతోంది. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరుస్టాఫ్ నర్సులు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటరు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక అటెండర్‌తో పాటు ఏడుగురు ఏఎన్ఎంలతో పాటు 11 మంది ఆశ వర్కర్లు పనిచేస్తారు. వీరికి తోడుగా సచివాలయాల్లో ఉండే ఏఎన్ఎం వివిధ సర్వేలకు సహకరిస్తుంటారు. ఆన్‌లైన్ సర్వే విధానం చేపట్టిన తరువాత ప్రజల ఆరోగ్యం బాగోగులపై సర్వే సక్రమంగా జరపాల్సి ఉంది. రైలుపేటలోని అద్దె భవనం పరిస్థితిపై ఆ ప్రాంత ప్రజలు అధికారులను అడిగారు. నూతనంగా రైలుపేటలో నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసి రైలుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు ఇవ్వాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



గూడూరు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

దివ్యాంగ విద్యార్థులను తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమాన్ని కాంక్షించి ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమల్జేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక బంగ్లా స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బుధవారం ఆయన ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలలో సామాన్య విద్యార్థులతో సమానంగా పోటీపడే విధంగా దివ్యాంగ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యాబోధనకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. కాగా నియోజకవర్గపరిధిలోని 17 మందికి రూ.1.55లక్షల విలువ గల ట్రై సైకిళ్ళను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్టు అధికారి ఎం. ఫణిధూర్జటి, ఎంఈవో ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఎంఈవో 2 వై.వి. హరనాథ్, రిటైర్డు డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి, బంగ్లా స్కూల్ హెచ్ఎం జి. భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, అనుముల పూర్ణచంద్రరావు, వహబ్‌ఖాన్, కట్టా మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

గూడూరు రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావును ఆదేశించారు. బుధవారం ఆయన టీడీపీ నాయకులతో కలసి గూడూరు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్కడైతే జాయింట్లు ఉన్నాయో అక్కడ బీటీతో ఫిల్ చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఏఈ రామాంజనేయులును ఆదేశించారు. టీడీపీ నాయకులు యక్క ల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, వీణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

అవనిగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని అవనిగడ్డ మండలభవన నిర్మాణ కార్మిక సంఘ నేతలు వేణుగోపాలరావు, అన్నపరెడ్డి నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. బుధవారం అవనిగడ్డ టిటిడి కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 24న మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండి.కరీముల్లా, మదాసు కుమార్, చంద్రశేఖర్, నలుకుర్తి వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

అవనిగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అవనిగడ్డ ఫైర్ స్టేషన్ అధికారి పిఎస్‌వివిప్రసాద్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవనిగడ్డలోని గుర్రప్ప చెరువు వద్ద గల అపార్ట్‌మెంట్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో మంటలు అదుపు చేసే విధానాలను వారు డెమో చేసి మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ప్రసూతి సేవలు అందించండి

అవనిగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రాంతీయ ఆస్పత్రికి ప్రసూతి సేవల కోసం వచ్చే వారికి ఉత్తమ సేవలు అందించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. అవనిగడ్డ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో నూతనంగా గైనకాలజిస్ట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బండి నాగశ్రీ ఎమ్మెల్యేను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలోని నిరుపేద మహిళలు ప్రసూతి అవసరాల కోసం ఎక్కువగా ప్రభుత్వ వైద్యశాలలపైనే ఆధార పడతారని, వారికి ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి కూటమితోనే సాధ్యం

● ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని సీఎం చంద్రబాబు మరోసారి రుజువు చేశారని, ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ అన్నారు. మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1997లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై విడుదల చేసిన జీవోను నిలుపుదల చేశారన్నారు. గతేడాది జులై వర్గీకరణపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు న్యాయమూర్తులతో ధర్మాసనం విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని ధర్మాసనం తుది తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల రానున్న రోజుల్లో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అందుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. మాల, మాదిగ సహా 59 కులాలు, ఉపకులాలు గుర్తించారన్నారు. 1994 నుంచి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుమహిళ అధ్యక్షురాలు వసంతకుమారి, చిట్టూరి యువరాజ్, లింగం విజయ్, అట్లూరి శ్రీను, పెనుమత్స అశోక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజును సత్కరించిన న్యాయవాదులు

మచిలీపట్నం బార్ అధ్యక్షుడిగా పోతురాజు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు జరిగిన హోరా హోరీ పోటీల్లో అధ్యక్షుడుగా దివి పోతురాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా రెడ్రౌతు రమణరావు, ప్రధాన కార్యదర్శిగా శాయన సుధాకర్, కోశాధికారిగా పసుమర్తి సూర్యప్రకాశరావు, జాయింట్ సెక్రటరీగా గాడె శామ్యూల్ ఎన్నికయ్యారు. 335 ఓట్లకు 313 ఓట్లు పోలయ్యాయి. 7 ఓట్లు మురిగిపోయాయి. అధ్యక్ష పదవికి పోటీ చేసిన దివి పోతురాజుకు 143 ఓట్లు పోలయ్యాయి. ఇప్పటి వరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఉన్న బూరగడ్డ అశోక్‌కుమార్‌కు 73, తుంగల హరిబాబుకు 90 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారి వింజమూరి శివరాం పోతురాజు విజయం సాధించినట్టు నియామకపత్రం అందజేశారు. కాగా ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన రెడ్రౌతు రమణరావు 159 ఓట్లు సాధించి గెలుపొందారు. ఈయనపై పోటీ చేసిన మహమ్మద్ మస్తాన్‌కు 78, కుంపటి ప్రసాద్‌కు 63 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పోటీ ముఖాముఖి జరిగింది. ఈ పోటీలో శాయన సుధాకర్ 173 ఓట్లతో గెలుపొందారు. ఇతనిపై పోటీ చేసిన సిద్ధినేని శ్రీ సత్యసాయిబాబు 114 ఓట్లు పోలయ్యాయి, కాగా కోశాధికారిగా పోటీ చేసిన పసుమర్తి సూర్యప్రకాశరావుకు 218 ఓట్లు పోలయ్యాయి. ఈయనపై పోటీ చేసిన వాసు రాధాకృష్ణమూర్తికి 76 ఓట్లు పోలయ్యాయి. కాగా జాయింట్ సెక్రటరీ పదవికి పోటీ చేసిన గాడె శామ్యూల్‌కు 239 ఓట్లు పోలుకాగా, అద్దేపల్లి నిరంజనరావుకు 48 ఓట్లు పోలయ్యాయి. విజేతలను పలువురు న్యాయవాదులుపూల దండలతో ముంచెత్తారు.



ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహిస్తున్న బుద్ధప్రసాద్

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎంపీడీవోలు మండలాల వారీగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ప్రజలకు సమర్థవంతంగా తాగునీటి సరఫరాను నిర్వహించేలా అన్ని వనరులను గుర్తించి ముందుగానే సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు మరియదేవి, సుధా ప్రవీణ్, స్వర్ణభారతి, ఏవి.రమణ, డి.సుబ్బారావు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్ మీదుగా బస్సు సర్వీసులు నడపాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నుంచి విజయవాడ వెళ్లే బస్సు సర్వీసులను కోనేరుసెంటర్ మీదుగా నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజుకు సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం, సీహెచ్. జయరావు, టి. చంద్రపాల్, ఎండి యూనస్, కొడాలి సుజాతలు వినతిపత్రం సమర్పించారు. 15 రోజుల నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు బైపాస్, మూడు స్తంభాల మీదుగా వెళుతున్నాయన్నారు. దీనివల్ల కోనేరుసెంటర్‌లో బస్సులు ఎక్కే ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో నడిపినట్టు బస్సు సర్వీసులను కోనేరుసెంటర్ మీదుగా నడపాలని కోరారు.

కందుకూరి వీరేశలింగం సేవలు మరువలేనివి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నాటక రంగానికి సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు మరువలేమని ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం మహతి కళావేదికపై దుర్గామల్లేశ్వరి కళాపీఠం ఆధ్వర్యంలో తెలుగు నాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడారు. తెలుగు నాటకానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయన్నారు. కళాపీఠం అధ్యక్షుడు చలమలశెట్టి గాంధీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రపంచ రచయితల మహాసభ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, తెలుగు బాషా సమాఖ్య అధ్యక్షుడు పైడిపాటి రాందేవ్, నాటకరంగ ప్రముఖులు వేముల సూరిబాబు, బెల్లంకొండ ఏడుకొండలు, హరికథకుడు కె. వేణుమాధవ్, ధరణికోట మల్లేశ్వరి మాట్లాడారు. ప్రముఖరంగస్థల నటుడు గాజుల కృష్ణమూర్తిని సత్కరించారు.

మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేలు పరిహారం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేలు నష్టపరిహారం పెంచడంపై జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోటు యజమానులు, కార్మికులు ఎన్నికల సమయంలో చంద్రబాబు, కొల్లు రవీంద్ర, కె. అచ్చెన్నాయుడును కలసి సమస్యను వివరించారు. ఇందుకు సీఎం చంద్రబాబు రూ. 10 నుంచి 20వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుని జీవో జారీ చేశారన్నారు. వేటకు వెళ్లని వారి వివరాలు అధికారులకు తెలిజేయాలన్నారు.



కృత్తివెన్ను పీఎస్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్ కుమార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్ కుమార్

కృత్తివెన్ను, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృత్తివెన్నులో క్రైం రేటు అధికంగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్ కుమార్ అన్నారు.పోలీస్ స్టేషన్ తనిఖీల్లో భాగంగా ఆయన జిల్లా ఎస్పీ గంగాధర్‌తో కలసి కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. మండలంలో క్రైం రేటు తదితర అంశాలను ఎస్సై పైడిబాబును అడిగి తెలుసుకున్నారు. ఐజీ మాట్లాడుతూ జాతీయరహదారి కావడంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువ అయ్యాయని ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో సూచలను ఇస్తామన్నారు. దొంగతనాల నివారణకు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల పర్యవేక్షణ బావుందన్నారు. ఆరు జిల్లాలో 22 వేల సీసీ కెమేరాల ఏర్పాటే లక్ష్యం కాగా 21 వేల సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ తనిఖీలలో బందరు డీఎస్పీ చొప్పిడి రాజా, రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23లోగా అభ్యంతరాలు తెలియజేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల పదోన్నతుల కోసం తయారు చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 23లోగా డీఈవో కార్యాలయానికి వచ్చి తెలియచేయాలని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. ఎస్‌జీటీ, ఎల్‌పీ, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తామన్నారు. అదే విధంగా గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఇందుకుగాను సీనియారిటీ జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 23లోగా డీఈవో కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా తెలియచేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పెడన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్ని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. దివ్యాంగ దంపతులు యర్రా మల్లిఖార్జునరావు, చౌడేశ్వరిలు పెడనలో నిర్వహిస్తున్న అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లో 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుళ్లుగా చేరి ప్రస్తుతం వివిధ స్థాయిలలో ఉన్న వారి ఆత్మీయ కలయిక బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ, 1989 బ్యాచ్ నెంబర్‌వన్ బ్యాచ్ అని ప్రశంసించారు. ఈ బ్యాచ్ విధి నిర్వహణలో ప్రతిభను కనబరచడమే కాక ప్రతి యేటా ఏదో ఒక ప్రజా సేవ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దివ్యాంగులైన మల్లిఖార్జునరావు, చౌడేశ్వరి దంపతులు తమ వైకల్యాన్ని లెక్క చేయకుండా అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌ను స్థాపించి నిరుపేదల ఆకలి తీర్చడం అభినందించదగ్గ విషయమని ఆయన ప్రశంసించారు. కాగా 1989 బ్యాచ్ అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకులు మల్లిఖార్జునరావు, చౌడేశ్వరి దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి 1989వ బ్యాచ్‌కు చెందిన గోదావరి ఉమామహేశ్వర రావు, కొసనం హేమానంద్, అడపా వెంకటేశ్వర రావు, సురేష్‌కుమార్‌లు నేతృత్వం వహించారు.

భక్తులకు అన్నసమారాధన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా బుధవారం పోలీసు కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు జరిగిన అర్చనల్లో పాల్గొన్నారు. ఏఎస్పీ వి.వి. నాయుడు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సతీష్‌కుమార్, రాఘవయ్య, కృష్ణంరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వీరేశలింగం ,చార్లీచాప్లిన్ జయంతి

గుడివాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ కళాశాల రోడ్డులోని సత్యసాయి సేవాసమితి మందిరంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం, చార్లీ చాప్లిన్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల రంగస్థల అనుభవం కలిగిన లోయ రాధాకృష్ణకు కీర్తిశేషులు కందుకూరి వీరేశలింగం నాటకకళా పురస్కారాన్ని అందజేశారు. తొలుత వీరేశలింగం, చార్లీ చాప్లిన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. రంగస్థల సీనియర్ నటులు బండారు రాధాకృష్ణ, సమితి సమన్వయకర్త ప్రసాద్, ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా నాయకులు షేక్ ఫరీద్ బాషా, చార్లీ చాప్లిన్ క్లబ్ వ్యవస్థాపకులు ప్రసాద్, మట్టా రాజా, పి.వి. సత్యనారాయణ, ఎ.వి.ఎస్ ప్రసాద్, ఎస్.మల్లిక్, బుజ్జి పాల్గొన్నారు.


రాధాకృష్ణను సత్కరిస్తున్న తెలుగు భాషా వికాస సమితి సభ్యులు

పేదలకు అందని వైద్యం

● అందుబాటులో లేని వైద్యులు ● మరమ్మతులకు నోచుకోని పీహెచ్‌సీ సెంటర్లు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు, కూచిపూడి) : తోట్లవల్లూరు పీహెచ్‌సీ 24 గంటలు పనిచేసే ఆస్పత్రుల జాబితాలో ఉంది. ప్రస్తుతం ఇద్దరు మహిళా డాక్టర్లు ఉండగా మూడో డాక్టర్‌ని నిమ్మకూరు నుంచి తోట్లవల్లూరు డిప్యుటేషన్‌పై వేశారు. అయినా ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడంలేదు. ఒక మహిళా డాక్టర్ వైద్యం కోసం వచ్చేవారికి ఇంగ్లీషు మందులు కన్నా ఆయుర్వేద వైద్యం మిన్న అన్నట్టు సూక్తులు చెప్తున్నారు. దీంతో రోగులు ఈ మహిళా డాక్టర్ వద్దకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. మరో మహిళా డాక్టర్ వద్దకు వచ్చేందుకు ఇష్టపడుతున్నట్టు రోగులు తెలిపారు. అయితే సాధారణ కాన్పులకు మాత్రమే ఈ పీహెచ్‌సీ ఉపయోగపడుతోంది. కాన్పు కష్టమై సిజేరియన్ చేయాల్సి వస్తే ఉయ్యూరు లేదా విజయవాడ ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంతో చాలా మంది గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటం లేదని స్థానికులు వాపోతున్నారు. ముగ్గురు డాక్టర్లు ఉన్నప్పటికీ లోకల్లో ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండరు. రాత్రి సమయాల్లో ఏదైనా కాన్పు కేసు వస్తే నైట్ డ్యూటీలో ఉన్న నర్సు ఉయ్యూరు వెళ్లమని చెబుతున్నారని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పీహెచ్‌సీ ఉన్న గ్రామంలో డాక్టర్లు నివాసముండాలి. అయితే ఈ గ్రామంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు..

కూచిపూడి: మొవ్వ పీహెచ్‌సీ వైద్యశాల పాత భవనం కావటం వల్ల శ్లాబు పెచ్చులూడి గోడలు పగులిచ్చి దర్శనమిస్తున్నాయి. చాలీచాలని గదుల్లోనే అన్ని విభాగాలను సరిపెట్టాల్సి వస్తుంది. గత నాలుగేళ్ల నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఇక్కడ జరగకపోవటంతో వైద్యులు క్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్ల కోసం మచిలీపట్నం వైద్యశాలకు రిఫర్ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లటం వల్ల గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్ వైద్యురాలిని నియమించాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఆపరేషన్ థియేటర్ సైతం వాడుకలో లేకపోవటం విశేషం. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు - నేడు కింద భవనం మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ రద్దు కావటంతో ఆసుపత్రి భవనం కనీస మరమ్మతులకు సైతం నోచుకోలేదు.


తోట్లవల్లూరు ప్రైమరీ హెల్త్ సెంటర్


మొవ్వలో పీహెచ్‌సీ భవనం గోడలకు నెర్రెలు


రక్తదాత కరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న రామకృష్ణ

ఆర్‌కే వారియర్స్ ఆధ్వర్యంలో రక్తదానం

గుడివాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : మోటూరుకు చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి రక్తమవసరమవ్వడంతో ఆర్‌కె వారియర్స్ సభ్యులు కరుణ్‌కుమార్ వెంటనే స్పందించి బుధవారం రక్తదానం చేశారు. రక్తదాత కరుణ్‌కుమార్‌ను బీజేపీ టూటౌన్ అధ్యక్షులు రామకృష్ణ, రాంబాబు, చరణ్‌లు అభినందించారు.


కోటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

బళ్లారి రాఘవ ధన్యజీవి

గుడివాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తన జీవితాన్ని ప్రజాకళలకే అంకితం చేసిన బళ్లారి రాఘవ ధన్యజీవి అని ప్రజానాట్యమండలి సీనియర్ గాయకులు ఆకురాతి జగన్మోహనరావు అన్నారు. స్థానిక సుందరయ్యభవన్‌లో సాహితీ స్రవంతి, ప్రజానాట్య మండలిల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తాడిపత్రి రాఘవాచార్యులు 79వ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాభరత నాట్యం ప్రదర్శించిన చిన్నారి ఆలూరి నాగశ్రీనివేదిత , చాణక్య ఏకపాత్రాభినయం చేసిన వెంకటేశ్వరరావు, సీతారామరాజు ఏకపాత్రాభినయం చేసిన కోటేశ్వరరావులను సత్కరించారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కొండల బాబు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

గుడ్లవల్లేరు : పెసరమిల్లిలోని రాజరాజేశ్వరీ సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో మండల పూజ, 108 కలశపూజ, జలాభిషేకం కార్యక్రమాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం 108 కలశాలకు పూజచేసి వాటిని పెసరమిల్లిలో 108 మంది మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. స్వామికి వేదపండితులచే జలాభిషేకం నిర్వహించారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గుడివాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐసీటీ అకాడమీ హెడ్ ఎస్.దినకర్‌రెడ్డి అన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు యూనివర్సిటీ పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందేలా పర్సనాల్టీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ లాంగ్వేజెస్, వివిధ పోటీలకు శిక్షణిస్తున్నామన్నారు. అనంతరం బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య , కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేస్తున్న కళాశాల కార్యదర్శి కోదండరామయ్య

పంచాయతీ కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితా

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో పీఎంఏవై 1.0 లబ్ధిదారులు 579 మందికి ప్రభుత్వం ప్రకటించిన అదనపు నిధులు జమయ్యాయని మండల గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ ఆలపాటి సురేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలో అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారుల జాబితాలను నోటీసు బోర్డుల్లో ఉంచారు. మండలంలో నిర్వహించిన ఏఎఫ్‌ఏ సర్వే ప్రకారం 598 మందికి బిల్లులకు సిఫార్సు చేయగా 579 మందికి అదనపు బిల్లులు జమ అయ్యాయని ఆయన తెలిపారు. ఎస్టీ లబ్ధిదారులు 61 గృహాలకు ఒక్కొక్కరికీ రూ. 75000 లు చొప్పున రూ. 45.75 లక్షలు, ఎస్సీ లబ్ధిదారులు 239 గృహాలకు, బీసీ లబ్ధిదారులు 279 గృహాలకు రూ. 50,000లు చొప్పున రూ.2.59 కోట్లు మొత్తం రూ.3.04 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.

మోటార్ కేబుల్‌వైర్ల దొంగల అరెస్ట్

తోట్లవల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ల దొంగలు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. ఒక మైనర్‌తో పాటు ఇద్దరు దొంగలను బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. గన్నవరం మండలం బుధవరం శివారు దాసర్లపాకకు చెందిన చలందార్ల స్వామి, ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన చలమచర్ల మహేశ్వరరావు, తేలప్రోలుకు చెందిన 17 సంవత్సరాల యువకుడిని బుధవారం సాయంత్రం మండలంలోని బొడ్డపాడు వద్ద పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్సై అవినాష్ తెలిపారు. ముగ్గురు బైక్‌పై వెళుతుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారిస్తే వారి వద్ద 9 కేజీల రాగివైరు మూట లభించిందన్నారు. వల్లూరుపాలెం, రొయ్యూరు, పాములలంకలో వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లు కత్తిరించినట్టు అంగీకరించారని తెలిపారు. పగలు పిట్టలను కొట్టేవారి లాగా పొలాలకు వచ్చి విద్యుత్ లైన్లను, మోటార్లను పరిశీలించి రాత్రి సమయంలో వచ్చి కేబుల్ వైర్లను కత్తిరించి ఆ వైర్లను కాల్చి అందులోని రాగివైరుని సేకరించి పాత ఇనుప కొట్లకు అమ్మేవారమని సదరు నిందితులు తెలిపారని ఎస్సై అవినాష్ చెప్పారు.


మోటార్ల కేబుల్ వైర్ల దొంగలతో ఎస్సై అవినాష్, సిబ్బంది

మట్టి నమూనా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మట్టి నమూనా కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పొలంలోని మట్టిని తవ్వి గుట్టగా పోసి మెత్తగా చేసి ఆ మట్టిని పరీక్షా కేంద్రానికి పంపించాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. బుధవారం లింగవరంలోని పొలాల్లోకి వెళ్లి ఆమె రైతులను పిలిపించి జియో ట్యాగింగ్ చేయించారు. అనంతరం రైతుల సమ్మతితో పొలంలోకి వెళ్లి మట్టిని తవ్వి భూ పరీక్షా కేంద్రానికి పంపారు. దీనివల్ల పొలంలో నత్రజని, భాస్వరం, పొటాష్ లవణాలు ఎంత శాతం ఉన్నవి, ఆ వివరాలు తెలుసుకుని ఖరీఫ్, రబీ పంటల్లో ఏయేమందులు వినియోగించాలో తెలుస్తుందన్నారు. మట్టిని పరిశీలించి వివరాలు ఒక కార్డు రూపంలో రైతులకు అందజేస్తామన్నారు. ప్రభుత్వం భూసార పరీక్షా కేంద్రాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. మండలంలో, ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా మట్టి నమూనాలు తీసుకుని పరీక్షా కేంద్రానికి తరలించాలని తెలిపారు. ఆర్‌ఎస్‌కే సెంటర్లు ఈ బాధ్యతలు తీసుకోవాలన్నారు. లింగవరంలో కొంతమంది రైతులను పిలిపించి వారి సమక్షంలోనే పొటోలతో మట్టిని తీసుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి , మండల విస్తరణాధికారిణి వి.అనిత, రైతులు శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


లింగవరంలో మట్టిని పరిశీలిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి


శ్రీసాయి షైనింగ్ స్టార్ పాఠశాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


గుడిపాడలో అగ్నిప్రమాద నివారణ పద్ధతులను చేసి చూపిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత తప్పనిసరి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలలో, గృహ సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఉండాలని కృష్ణా జిల్లా అగ్నిమాపకశాఖ అసిస్టెంట్ జిల్లా అధికారి ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని శ్రీ సాయి షైనింగ్ స్టార్ స్కూల్లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గుడివాడ ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రమాదాన్ని ఏ విధంగా నివారించాలో మెళకువలు తెలుసుకోవాలన్నారు. పెద్దల సలహాలు, సూచనలు అనుసరించాలని తెలిపారు. అవసరమైనప్పుడు ఫోన్ల ద్వారా అగ్నిమాపక సిబ్బందికి వెంటనే తెలియజేసి అగ్ని ప్రమాదాల నివారించవచ్చునని తెలిపారు. ఎప్పుడు ఫోన్ చేసినా అగ్నిమాపక సిబ్బంది అందుబాటులోకి వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, స్కూల్ మేనేజ్‌మెంట్ లింగమనేని జగదీష్, లింగమనేని స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడివాడ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక రాజేంద్రనగర్‌లోని మానస సరోవరం, ప్రశాంతి అపార్టుమెంట్‌లలో బుధవారం అగ్నిప్రమాదాలను నియంత్రించే పద్ధతులను ప్రత్యక్ష ప్రయోగం చేసి చూపించి అపార్టుమెంట్‌వాసులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలను ఎలా నియంత్రించాలో క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తప్పించుకునే మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో డివై.విష్ణు ప్రసాద్

నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం

గుడివాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యంగా కేంద్రం అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని మున్సిపాల్టీ పరిధిలో విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులను గుర్తించిన వారిలో క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కె.ఇ.వి. బసవేశ్వరరావు, సీడీపీవో విజయఫ్లారెన్స్, మండల విద్యాశాఖాధికారి బాలాజీ, మెప్మా సీవోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: మండలంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ (నూరు శాతం అక్షరాస్యత) కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి తిరిగి నిరక్షరాస్యులు, అక్షరాస్యుల డేటా సేకరించాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రోగ్రామ్ నిర్వహించి వారిని అక్షరాస్యులుగా తయారు చేయటానికి అందరం కృషి చేద్దామని ఆయన తెలిపారు. ఎంఈవో-2 బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కోసూరులో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కృష్ణవేణి

కూచిపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కోసూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార లోపం గల పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామసర్పంచ్ పెనుమూడి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుణ్యవతి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎంఎస్.ఎన్.మూర్తి, ఏఎన్‌ఎం లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు శిరీష, పరిమళ, పద్మావతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పామర్రు: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ పేర్కొన్నారు. జుజ్జవరం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు, బాలింతలకు తగు సూచనలిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణసాధన కోసం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిష్టాత్మకంగా అమల్జేస్తున్న పథకాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సూక్ష్మపోషకాలు గల ఆహారం తీసుకునే విధంగా గర్భిణులను, చిన్నారుల తల్లులను పోత్సహించే బాధ్యత సంబంధిత కేంద్రాల కార్యకర్తలు తీసుకోవాలన్నారు. జన్మించిన శిశువు రెండేళ్ల వయస్సు వచ్చేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి ఉదయలక్ష్మి, ఏఎన్‌ఎం విజయమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధా, అంగన్వాడీ టీచర్లు వై.రాజ్యలక్ష్మి , సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : గర్భిణులు పౌష్టికాహారంతోపాటు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని గుడివాడ సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ అన్నారు. బుధవారం రామన్నపూడి పరిధిలోని ఏడు అంగన్వాడీ కేంద్రాలలోని గర్భిణులు, బాలింతలకు తట్టివర్రు పంచాయతీ కార్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ కుటుంబం చక్కగా ఉండాలంటే ముందుగా మహిళలు ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ప్రతి మహిళ కుటుంబంలో ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ పౌష్టికాహారం అందించాలని తెలిపారు. తట్టివర్రు, రామన్నపూడి గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీరున్నీసా, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం(సీఎంఏఎం)తోనే పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చునని సీడీపీవో ఎ.విజయఫ్లారెన్స్ పేర్కొన్నారు. పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా స్థానిక నాగవరప్పాడులోని అంగన్వాడీ కేంద్రం-4లో బుధవారం సీఎంఏఎంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బరువును తూచి, సదరు పిల్లలు సీఎంఏఎంలో ఉన్నారా లేదా అని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రీ స్కూల్ యాక్టివిటీ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఉపాధ్యాయులు జి.సుధారాణి, ఎం.రమణ, ఏఎన్‌ఎం ఉదయ, ఎంఎస్‌కే స్పందన, అంగన్వాడీ టీచర్ వాణిశ్రీ, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తట్టివర్రులో సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ సీడీపీవో విజయ ఫ్లోరెన్స్



జుజ్జవరంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సత్యశ్రీ

బాటసారులకు మజ్జిగ పంపిణీ

గుడివాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది స్థానిక శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకటనాగబాబు మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని వ్యవసాయ శాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. వ్యవసాయ ఏ.వో బి.అనంతలక్ష్మీ, శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం అధ్యక్షులు హరికుమార్, గంగాధరరావు, అర్జున్, సాయి పాల్గొన్నారు.

కిషోర్, మాణిక్యాలరావులను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలి

పెదపారుపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నుంచి పెదపారుపూడి సర్పంచ్ సమీరా భర్త మండల టీడీపీ మాజీ కార్యదర్శి చప్పిడి కిషోర్, చప్పిడి మాణిక్యాలరావును సస్పెండ్ చేయాలని, ఈ మేరకు మండల కమిటీ తీర్మానించినట్లు టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి అన్నారు. బుధవారం వెంట్రప్రగడ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ పునుకొల్లు వీర వెంకట నాగబెనర్జీపై గ్రామసర్పంచ్ భర్త చప్పిడి కిషోర్ వర్గం దాడి చేశారు. ఆ ఘటనపై పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు పెదపారుపూడి సర్పంచ్ భర్త చప్పిడి కిషోర్, చప్పిడి మాణిక్యాలరావులపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. మండల కార్యదర్శి రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు చిలకా ఆంజనేయులు, గొరిపర్తి రవికుమార్, సునీత, కూచిపూడి సుబ్బయ్య, కలపాల కిషోర్, రమేష్, విజయ ప్రకాష్, , టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.